వేసవి వెన్నెల.. అలరించిన అన్నమయ్య కీర్తనలు

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న వేసవి వెన్నెల కార్యక్రమంలో భాగంగా చిన్నారులు అన్నమయ్య కీర్తనలతో అలరించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు అన్నమయ్య కీర్తనలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఈనెల 25వ తేదీ వరకు శిక్షణ ఉంటుంది.

ఇంటి వద్దకే సీతారాముల తలంబ్రాలు

మియాపూర్: భద్రాచలం సీతారాముల కల్యాణం తలంబ్రాలు ఇంటి వద్దకు వచ్చేలా బుక్ చేసుకునే అవకాశంను ఆర్టీసీ కల్పించిదని మియాపూర్–2 డిపో మేనేజర్ వెంకటేశం, ఏఎంటీ ప్రశాంత్‌రెడ్డి, డిపో మార్కెటింగ్ ప్రతినిధి రమేష్‌గౌడ్ తెలిపారు. స్వామి వారి తలంబ్రాలు కావాలనుకునే భక్తులు 8919525373, 9154298825 నంబర్లలో సంప్రదించి రూ.151లు చెల్లించి రశీదు పొందాలని తెలిపారు. కళ్యాణానికి వెళ్లలేని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



శేరిలింగంపల్లి: ఆదర్శనగర్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఉత్సవమూర్తులకు అభిషేకం, హోమం చేశారు. కాలనీ వాసులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

శిశువు మృతదేహం లభ్యం

మాదాపూర్: నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని మెడికవర్ ఉమెన్స్, చైల్డ్ హాస్పిటల్ పక్కన బస్టాప్ ముందు ఉన్న డ్రైనేజీ వద్ద మగశిశువును శనివారం గుర్తించారు. తెల్లవారు జామున 5.30 గంటలకు హాస్పిటల్ సెక్యూరిటీ సిబ్బంది చూసి డాక్టర్‌కి, పోలీసులకు సమాచారం అందించారు. వర్షానికి కొట్టుకువచ్చి డ్రైనేజీ వద్ద నిలిచిపోయినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పటాన్ చెరు ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బస్టాండ్ సమీపంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఆటో డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ, రాంగ్ రూట్ లో ఆటోలను నడప వద్దని, అదే విధంగా ఎక్కడపడితే అక్కడ రోడ్డు పై ఆటోలను నిలప వద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

ఆల్విన్‌కాలనీ: ఆయా డివిజన్‌లలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని మొగులమ్మ బస్తీ కాలనీలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపనలు

మియాపూర్: మియాపూర్, చందానగర్ డివిజన్ పరిధిలో రూ.3కోట్ల49లక్షల80వేలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆదివారం ఉదయం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారు. డివిజన్ల పరిధిలోని సాయినగర్ కాలనీ, డాక్టర్ రెడ్డీస్ కాలనీ, హెచ్ఎంటీ కాలనీ, దీప్తిశ్రీనగర్, శాంతి నగర్, సురక్ష ఎన్‌క్లేవ్, కేఎస్ఆర్ ఎన్‌క్లేవ్, వేముకుంట, సత్యా ఎన్‌క్లేవ్ కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.

వర్షం.. అండర్‌పాస్‌ల్లో భారీగా నీరు

చర్యలు తీసుకున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

ట్రాఫిక్ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకున్న సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు



కొండాపూర్ అండర్‌పాస్ వద్ద మోటార్లతో నీటిని తొలగిస్తున్న దృశ్యం





లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద..

శేరిలింగంపల్లి/రాయదుర్గం: అకాల వర్షంతో అండర్‌పాస్‌ల వద్ద భారీగా నీరు నిలిచిపోయింది. ముఖ్యంగా కొండాపూర్ అండర్‌పాస్, లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు నిలిచిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఇదే పరిస్థితి. కొండాపూర్ అండర్‌పాస్ వద్ద సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్, సర్కిల్ అధికారులు, సిబ్బంది మోటార్లతో వరదనీటిని నీటిని తొలగింపజేశారు. పది గంటల నుంచి తిరిగి రాకపోకలు సాగేలా చేశారు.

ఇబ్బందిపడ్డ పదో తరగతి విద్యార్థులు

లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు చేరడంతో పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఇక్కట్లు పడ్డారు. తారానగర్, చందానగర్, మియాపూర్ ప్రాంతాల నుంచి లింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసే విద్యార్థులు చుట్టూ తిరిగి రావాల్సి వచ్చింది. ఇక పలు చోట్ల రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడగా, చెత్తాచెదారం చేరింది. జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించి రోడ్లు శుభ్రం చేశారు.



ఐటీ కారిడార్‌లో చెట్టు కొమ్మలు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

టెలికామ్‌నగర్‌లో త్వరలో పర్యటిస్తా

ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, త్వరలో కాలనీలో పర్యటిస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. శనివారం టెలికామ్‌నగర్‌వాసులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. కాలనీలో చాలా రోడ్లు అధ్వానంగా మారాయని, మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, సరఫరా సమయం పెంచాలని కోరారు. పలుచోట్ల మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు మల్లన్న కల్యాణం

మణికొండ: ప్రతి సంవత్సరం నిర్వహించే మల్లన్న స్వామి కల్యాణోత్సవానికి మణికొండ గ్రామం సిద్ధం అయ్యింది. ల్యాంకోహిల్స్ సమీపంలో ఉన్న మల్లన్న, బీరప్ప, రేణుక ఎల్లమ్మ దేవాలయాలను అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టెంట్‌లు, ఫ్యాన్‌లు, కూలర్‌లు ఏర్పాటు చేశారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8గంటలకు గంపలు ఎత్తుకుని భక్తులు దేవాలయానికి చేరుకుంటారు. అనంతరం మల్లన్నకు కొట్నం పెట్టడం, 11.15 గంటలకు మల్లన్న కల్యాణం, మధ్యాహ్నం 1 గంటకు అన్నప్రసాద వితరణ, 2.30గంటలకు అగ్నిగుండాలు తొక్కటం, 3గంటలకు సదర్‌పటం , సాయంత్రం 5గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9గంటల నుంచి మల్లన్న చరిత్ర ఒగ్గు కథ ఉంటుందని దేవాలయ కమిటీ తెలిపింది. సోమవారం మధ్యాహ్నం ఒడి బియ్యం అన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

రాయదుర్గం: అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేసిన వారికి పదవులు లభిస్తాయని చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కొండాపూర్, మసీదు బండలోని బీజేపీ కార్యాలయంలో శనివారం రంగారెడ్డి అర్బన్ జిల్లా నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యమన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు,మహిళామోర్చా, బీజేవైఎం, ఎస్సీ,ఎస్టీ మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నయన మనోహరం..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం నిత్య ఆనందరామ్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనలో భాగంగా రంగపూజ, గణేశకౌతం, కీర్తనం, మూషికవాహన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు ఐషు, తేజస్విని, శ్రేయ, ఆద్య, హర్షిత, యశస్వి, ప్రశక్తి, శాన్వి, వలిక, క్రిష, త్రిశిక పాల్గొన్నారు. సునీత దివాకరుని శిష్యబృందం దశావతార శబ్దం, హిమగిరి, రామాయణ శబ్దంను ఆపేక్ష, ఆరోహి, ధన్విక, నిత్యహేమ, పరిణిక, రిత్విక, రుషిక, సాత్విక, శాన్వి, స్తోత్ర, శృతి, తన్వి ప్రదర్శించారు.



కొనసాగుతున్న ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



రాయదుర్గం: హైటెక్ సిటీ పరిధిలో పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం గచ్చిబౌలి డీఎల్ఎఫ్ రోడ్డులోని వరలక్ష్మీ టిఫిన్ సెంటర్‌ను అధికారులు పరిశీలించారు. నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. కిచెన్‌లో యధేచ్ఛగా ఎలుకలు సంచరించడం, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలను వేయడం వలన మురుగునీరు పొంగి దుర్వాసన వెదజల్లుతోందని అధికారులు తెలిపారు. అనంతరం మాదాపూర్‌లోని క్షత్రియ ఫుడ్ రెస్టారెంట్‌లో సింథటిక్ రంగులు వాడుతున్నట్లు గుర్తించారు. కిచెన్‌లో రిఫ్రిజిరేటర్ అధ్వానంగా ఉండడంతో బాటు చికెన్, మటన్ నిల్వ ఉందని అధికారులు గుర్తించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపు జాబ్ మేళా

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ... డిగ్రీ పూర్తి చేసిన, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మైక్రోసాఫ్ట్, ఎస్.ఐ.ఐ.టి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, టీం లీప్స్, ధ్రువన్స్ సొల్యూషన్స్ తదితర కంపెనీలు నియామకాలు చేపడతాయని వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు రెజ్యూమ్ తో పాటు ఐదు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూ లో పాల్గొనాలని తెలిపారు.

హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు 'పోస్టు కార్డు' ఉద్యమం

ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రారంభం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు అఖిల భారత విద్యార్థి పరిషత్ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో 'పోస్టు కార్డు' ఉద్యమం చేపట్టింది. శుక్రవారం రాత్రి హెచ్‌సీయూలో 'సేవ్ హెచ్‌సీయూ ల్యాండ్స్' పేరిట పోస్టు కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివేకానంద స్టూడెంట్స్ అమెనిటీస్ సెంటర్ వద్ద ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆయుష్‌కుమార్‌సింగ్‌లు మాట్లాడుతూ హెచ్‌సీయూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తూ నగరపేరును యావత్ ప్రపంచానికి చాటి చెబుతోందని, ఇంతటి ప్రాధాన్యత కలిగిన హెచ్‌సీయూ క్యాంపస్ భూమిని ప్రభుత్వం విక్రయించాలని నిర్ణయించడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ఉద్యమంలో క్యాంపస్‌లో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామన్నారు.కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



విద్యార్థులకు నీటి ప్రాధాన్యతను వివరిస్తున్న ప్రతినిధులు



క్లీనప్‌డ్రైవ్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

రాయదుర్గం: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్ కేశవనగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. వాటర్ ఏఐడీ ఇండియా తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకురాలు విజయరేఖ పర్యవేక్షణలో నీటి ప్రాముఖ్యతపై విద్యార్థులకు ఉపన్యాసం, పెయింటింగ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందచేశారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయరాదని సూచించారు. అనంతరం విద్యార్థులు సేవ్ వాటర్, వరల్డ్ వాటర్ డే అనే నినాదాలను రంగోలి వేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దయానా, శారద, లక్ష్మీ, విద్యార్థులు, వాటర్ ఏఐడీ ఇండియా–తెలంగాణ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

బర్లకుంటలో క్లీనప్ డ్రైవ్

గచ్చిబౌలిలోని బర్లకుంట చెరువు పరిసరాల్లో శనివారం క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని ధృవాంశ్ స్వచ్ఛంద సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులతో పాటు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ విద్యార్థులు, పెగా సిస్టమ్స్, సేల్స్‌ఫోర్స్, టాటా ఉద్యోగులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు పరిసరవాసులకు, కాలనీలవాసులకు చెరువుల ప్రాధాన్యత ,శుభ్రత గురించి అవగాహన కల్పించారు.

నాలా విస్తరణ పనులు పరిశీలన

శేరిలింగంపల్లి: వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామమని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నల్లగండ్ల చెరువు నుంచి బీహెచ్ఈఎల్ కూడలి ఇండియన్ గ్యాస్ గోడౌన్ నాలా వరకు ఎస్ఎన్‌డీపీ అండర్ హైసిటీలో భాగంగా రూ.28.45 కోట్లతో చేపట్టే ఓపెన్ డ్రైన్ ఆర్‌సీసీ బెడ్, సైడ్‌వాల్స్ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నా లాల విస్తరణ పనులతో ముంపు సమస్య ఉండదన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. వర్షాకాలంలోపు పనులన్నీ పూర్తి చేయాలన్నారు. డీఈ ఆనంద్, ఏఈ భాస్కర్, ఎస్ఎన్‌డీపీ డీ రాజు, నాయకులు వీరేశంగౌడ్, రాంచందర్, కొండల్‌రెడ్డి, నారాయణ, లక్ష్మణ్, బచ్చురాజు, ఖాజాపాషా, గోవింద్‌చారీ, లక్ష్మణ్‌యాదవ్, గోపాల్ యాదవ్, పవన్,రాము, సుభాష్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారమయ్యేదెన్నడు..?

నల్లగండ్ల– తెల్లాపూర్ రోడ్డులో నిలుస్తున్న మురుగునీరు.. ఏళ్ల తరబడి సమస్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ ముఖద్వారం వద్ద రోడ్డుపై పెద్ద ఎత్తున మురుగునీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. శేరిలింగంపల్లి పరిధిలోని నల్లగండ్ల నుంచి తెల్లాపూర్ వెళ్ళే మార్గంలో తెల్లాపూర్ కమాన్ వద్ద మురుగునీరు నిలుస్తుంది. భారీగా మురుగు నీరు చేరినప్పుడు నామమాత్రంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో బ్యాంక్, హోటల్స్ ఉండడంతో అక్కడికి వచ్చే వినియోగదారులు, వాహనదారులు అవస్థపడుతున్నారు. చిన్నపాటి వర్షానికి ఈ ఏరియా జలమయంగా మారుతుంది. రోడ్డు నిర్మాణ సమయంలో రోడ్డు పక్కన నిర్మించిన కాలువను పూర్తి చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై గత ఏడాది అక్టోబర్‌లో వార్త ప్రచురితమవడంతో వారం రోజులలో సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపిన అధికారులు ఇప్పటి వరకు పరిష్కారాన్ని చూపలేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారులపై మురుగు!

రహదారులపై మురుగు పారుతోంది. దుర్గంధంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిలోమీటర్ల కొద్దీ మురుగునీరు పారుతున్నా సంబంధిత అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఈగలు, దోమలు వృద్ధి చెంది పగలు, రాత్రి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ ● దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు



ఎల్లమ్మబండ గుడ్‌విల్ హోటల్ వద్ద పారుతున్న మురుగు నీరు

ఆల్విన్‌కాలనీ: వీధులన్నీ మురికి కూపంగా మారాయి. డ్రైనేజీ నీరు రోడ్లపై పారుతుండటంతో దుర్వాసన భరించలేక వ్యాపారులు, స్థానికులు తలుపులు మూసుకొని గడపాల్సి వస్తుంది. రహదారులపై మురుగు పారుతుండటంతో వేగంగా వెళ్లే వాహనాల తాకిడికి మురుగు పడి చిన్నపాటి గొడవలకు దారి తీస్తున్నది. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్, పాపారాయుడునగర్, ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని ప్రధాన రహదారిలో కొన్ని నెలలుగా మురుగునీరు పొంగి పొర్లుతుంది. అదేవిధంగా ఆల్విన్‌కాలనీ, జలకన్య సెంటర్ నుంచి సాయినగర్‌కు వెళ్లే దారిలోని మూలమలుపు వీధిలో డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఎల్లమ్మబండ ప్రధాన రహదారి గుడ్‌విల్ హోటల్ సమీపంలో, ఎల్లమ్మబండ, జయశంకర్ విగ్రహం సమీపంలోని, భాగ్యనగర్ కాలనీ ఉషాముళ్లపూడి రోడ్డును ఆనుకుని ఉన్న మాధవీనగర్ కాలనీలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. వీధుల్లో మురుగు నిలుస్తోంది. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కాలనీల్లో పర్యటించి డ్రైనేజీ సమస్య జఠిలంగా ఉన్న ప్రాంతాలను పరిశీలించి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంక్షేమ సంఘాల సభ్యులు కోరుతున్నారు.



ఆల్విన్‌కాలనీలో జలకన్య హోటల్ సమీపంలో..



పాపారాయుడు నగర్ కాలనీలో ..